ప్రజాశక్తి
శనివారం 11 నవంబర్ 2023
5



తూనికలు, కొలతలపై అప్రమత్తంగా ఉండాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పెదబయలు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో మండల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల గోడ పత్రికను తహసీల్దార్ రంగారావు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ, తూనికలు, కొలతల పట్ల వినియోగదారుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు సంఘం సేవలో మండి కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బూడిద చిట్టిబాబు, రమేష్, బాలరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు కూడా కృష్ణబాబు, దేవరాజు, సంజీవి బాబు పాల్గొన్నారు.

టూరిజం కార్మికులతో చర్చలు విఫలం

- నేటి నుంచి సమ్మె- మూతపడనున్న పర్యాటకశాఖ యూనిట్లు

ప్రజాశక్తి- అరకులోయ: సమ్మెతో మూతపడనున్న అరకులోయ మయూరి హిల్ రిసార్ట్, పున్నమి వ్యాలీ రిసార్ట్, అనంతగిరి హరిత హిల్ రిసార్ట్, తైడా జంగిల్ బెల్, లంబసింగ్ టూరిజం రిసార్ట్ లు, రెస్టారెంట్లు. టూరిజం కార్మికులతో ఆ శాఖ యాజమాన్యం జరిపిన చర్చలు విఫలం కావడంతో టూరిజం కార్మికులు ఈనెల 11 శనివారం నుంచి అల్లూరి జిల్లాలోని పర్యాటకశాఖ యూనిట్లన్నీ మూసివేసి సమ్మె చేయడానికి కార్మికులు నిర్ణయించుకున్నారు.గత నెల ఏడో తేదీ నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తూ వస్తున్నారు. పర్యాటకశాఖ యాజమాన్యం స్పందించకపోవడంతో ఈనెల 11 నుంచి సమ్మెకు వెళ్తామని ఆ శాఖ యాజమాన్యానికి సమ్మె నోటీసులు జారీ చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్ర అప్పటి ఎస్టీ కమిషన్ చైర్మన్ తో, టూరిజం యాజమాన్యం, కార్మికుల మధ్య విజయవాడలోచర్చలు జరిగాయి. గత నెలలో ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లతో చర్చలు జరిగాయి. పర్యాటకశాఖ యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారు. శుక్రవారం కూడా అరకులోయ పున్నమి వ్యాలీ రిసార్ట్ లో పర్యాటకశాఖ ఆర్ డి శ్రీనివాస్, డిఓఎం హరిత, టూరిజం కార్మిక సంఘం నాయకులు, అనంతగిరి జెడ్పిటిసి సభ్యుడు సిఐటియు గౌరవ అధ్యక్షుడు దీసరి గంగరాజు టోకూరు సర్పంచ్ మొస్య సమక్షంలో సుదీర్ఘంగా రాత్రి 8 గంటల వరకు చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది.

కార్మికుల ప్రధాన డిమాండ్ పర్మినెంట్ చేయాలని, 2010లో అప్పటి టూరిజం ప్రత్యేక సెక్రటరీ చందన ఖాన్ తో జరిగిన ఒప్పందం అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల హెచ్‌ఆర్ పాలసీ అమలు, సర్వీసు క్వాలిఫికేషన్ పద్ధతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, డైలీ వేస్ కార్మికులకు ఆప్కాస్ లో కలపాలని, టూరిజం కార్మికులందరినీ గ్రాట్యుటీ అమలు చేయాలని టూరిజం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన ఏ ఒక్కటి కూడా పరిష్కారం చూప లేదు.ఈ సమస్యలన్నీ టూరిజం కార్పొరేషన్ పరిధిలో లేదని, గవర్నమెంట్ పాలసీ అంశాలని చర్చల్లో పర్యాటక శాఖ ఆర్డి శ్రీనివాస్ తేల్చి చెప్పడంతో కార్మికులకు వేరే ప్రత్యయం మార్గం లేకపోవడంతో సమ్మెబాట పడుతున్నామని ఏపీ టూరిజం కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మిక సంఘం రాష్ట్రఅధ్యక్షుడు డి గంగరాజు, కార్యదర్శి బాబూరావు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి అంజలిరావులు స్పష్టం చేశారు. సమ్మె పై స్పందించిన జిల్లా కలెక్టర్ ఫోన్ లో కార్మిక సంఘం నాయకులతో శుక్రవారం రాత్రి సంప్రదించి నచ్చచెప్పే ప్రయత్నం చేసిన కార్మికులు సమ్మెకే మొగ్గు అంటూ సమ్మెకే మొగ్గు చూపారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి అల్లూరి జిల్లాలోని ఆరు పర్యాటక శాఖ యూనిట్లన్నీ మూతపడనున్నాయి.


చర్చల విఫలం కావడంతో నినాదాలు చేస్తున్న కార్మికులు , నేతలు


అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

కార్మికుల సమ్మెకు మద్దతు : జడ్పిటిసి గంగరాజు

ఈ నెల 11 నుంచి కార్మికులు చేపడుతున్న సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు నిస్తున్నామని అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి సభ్యుడు దీసరి గంగరాజు స్పష్టం చేశారు. కార్మికులు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని 2010 నుంచి పోరాడుతున్నప్పటికీ టూరిజం యాజమాన్యం ఇప్పటివరకు కూడా కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణకు పిల్లల చదువులకు తీవ్ర ఇబ్బందులు పడుతూ దుర్భర జీవితం గడుపుతున్నారని ఆయన అన్నారు. ప్రతి ఏటా కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి అధికారులకు ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు.ఈ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు కూడా టూరిజం కార్మికులకు అండగా నిలబడి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు మద్దతుగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రాంతంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, టూరిజం కార్మికుల సమస్యల పట్ల స్పందించాలని ఆయన అన్నారు. పర్యాటకశాఖ కార్మికుల సమస్యలను జిల్లా పరిషత్ సమావేశంలో కూడాలేవనెత్తి ప్రస్తావిస్తానని జడ్పిటిసి గంగరాజు స్పష్టం చేశారు.


పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి–అరకులోయ: చెకుముకి పేరుతో అల్లూరి జిల్లాలో పాఠశాల స్థాయి సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా 27 పాఠశాలల నుండి సుమారు 1721 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇందులో ప్రతీ పాఠశాల నుండి ముగ్గురు చొప్పున ఎంపికయిన విద్యార్థులు నవంబరు 30న ఆయా మండలాల్లో జరిగే మండలస్థాయి పోటీల్లో పాల్గొనవలసి ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి యండమూరి పారయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాడేరు ఏపిఆర్ బాలికల పాఠశాల లోజరిగిన అంతర్జాతీయ సైన్స్ దినోత్సవ సభ లో శాంతియుత పరిస్థితుల కోసం సైన్స్ –సుస్థిర అభివృద్ధి కోసం సైన్స్ " అనే నినాదంతో ప్రతీ సంవత్సరం నవంబర్ 10న అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం జరపాలని 2002 లో యునెస్కో నిర్ణయించిందని చెప్పినట్లు ఆయన అన్నారు.ఆ మేరకు " సైన్స్ పట్ల నమ్మకం " అనే అంశం పై ఈ ఏడాది చర్చ జరగాలని యునెస్కో పిలుపిచ్చిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.గణేష్ ,వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్ చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

తప్పని డోలీ మోత

ప్రజాశక్తి–హుకుంపేట: మండలంలో గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామంలో వల్లభాయి రాధమ్మ ప్రసవం నిమిత్తం ఆసుపత్రికి తరలించడానికి గాను సరైన రోడ్డు సౌకర్యం లేక 2 కి.మీ వరకు గర్భిణీని డోలీ మోతతో గత్తుం వరకు తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.గ్రామ ప్రజలు సమస్యల పై ఐటీడీఏ స్పందన కార్యక్రమంలో సుమారుగా ౣ అర్జీలు సమర్పించినా పరిష్కరించలేదన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో రహదారి, తాగునీరు తదితర సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఐసిడిఎస్ ఉద్యోగ నియామకాలను

స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలి

- ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం నిరసన - ఐసిడిఎస్ నోటిఫికేషన్ పత్రాలు దగ్ధం

ప్రజాశక్తి- పాడేరు: ఐసిడిఎస్‌లో ఉద్యోగాలను స్థానిక ఆదివాసిలతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాడేరు స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత ధర్నా నిర్వహించారు. ముందుగా ఐటిడిఎ కార్యాలయం నుండి ర్యాలీ అనంతరం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల వివిధ ఉద్యోగాల భర్తీకి ఐసిడిఎస్ ద్వారా జారీ అయిన నోటిఫికేషన్ ప్రతులను వారు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభుదాస్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు ఆదివాసీ జిల్లాలో స్థానిక ఆదివాసీలకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా ఐసిడిఎస్ ఈ నెల 4న జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్ 5వ షెడ్యూల్డ్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా వుందన్నారు. గురుకులం, ఏకలవ్య పాఠశాలలు, శిశు సంక్షేమశాఖ (ఐసిడిఎస్)లు భర్తీ చేస్తున్న మిషన్ వాత్సల్య 22 పోస్టులు కూడా ఒక్క స్థానిక ఆదివాసీలకు కేటాయించలేదన్నారు.. ఫలితంగా ఆదివాసీ నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ జారీచేసిన ఉద్యోగ నోటిఫికేషన్లో ఒక్క పోస్టు కూడా ఆదివాసీలకు కేటాయించలేక పోవడం దారుణమన్నారు. ఆదివాసులకు అన్యాయం చేసే ఈ నోటిఫికేషన్ను రద్దు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు జాబితాల్లో చేర్చి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. 5వ షెడ్యూల్ క్లాజ్ – 2 ప్రకారం జి.ఓ 3 రిజర్వేషన్ చట్టబద్ధతకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయాలని గిరిజన సలహ మండలి తీర్మానం చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని గౌరవించడం లేదని విమర్శించారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాంతంలో ఉపాధ్యాయుల బదిలీ సందర్భంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు, ఎసిటి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సుమారు 600 పోస్టులు వివిధ కారణాలు చూపుతూ ఏజెన్సీ ప్రాంతంలో రద్దు చేశారన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువ వుందని 107 స్కూల్స్ మూసివేసారని విమర్శించారు.

ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కృష్ణారావు మాట్లాడుతూ, వివిధ శాఖలలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పేర్లతో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు. ఉద్యోగాలు లేక ఆదివాసీ యువత తీవ్రమైన మానసిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీ ఎవరి కోసం పని చేస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గిరిజన స్పెషల్ డిఎస్సీ 1495 గిరిజన సంక్షేమశాఖ టీచర్ పోస్టులు (అల్లూరి జిల్లాలో 611 పోస్టులు), 40వేల మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలలో 2.50 లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నోటిఫికేషన్ రద్దు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు జాబితాల్లో చేర్చి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసారు. అనంతరం ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, జిల్లా కార్యదర్శులు పాంగి చిన్నారావు, జీవన్, గిరిజన సంఘం నాయకులూ టి కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ నాయకులూ కార్తీక్ విద్యార్థులు, ఆదివాసీ నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న నాయకులు, విద్యార్థులు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి–విఆర్.పురం

వైసిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం తప్పా వైసిపి ప్రభుత్వ హయాంలో మండలంలో చేసిన అభివృద్ధి శూన్యమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు విమర్శించారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. మండలంలో నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పెదమట్టపల్లి– నర్సింగపేట రహదారి, తెల్లవారి గూడెం– గుల్లెటివాడ రోడ్డు, పెదమట్టపల్లి– బూరుగువాడ బిటి రోడ్డు తదితర రోడ్లు తవ్వి వదిలేశారని, వారిని పూర్తి చేయకపోవడంతో ప్రజలు నరక యాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెజిబివిలో అదనపు తరగతి గదులు నిర్మాణం సంవత్సరాల తరబడి నత్తనడకన ఎందుకు సాగుతుందో చెప్పాలన్నారు. గొల్లగూడెంలో మూడు కుటుంబాలు వైసిపిలో చేరితే 30 మంది చేసినట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సిపిఎంపై వైసిపి నేత చిచ్చడి మురళి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సీపీఎంకి పదవులు, అధికారం ముఖ్యం కాదని, ప్రజల సమస్యలు పరిష్కారమే ప్రధానమని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిరపు తాతబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి–కూనవరం : సిపిఎం ప్రజారక్షణ భేరి వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని మార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో సీపీఎం మండల నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ రక్షణ భేరి యాత్రలో భాగంగా ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందని, దానికి ప్రజలు వేలాదిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో మతాల పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీని, దానికి కొమ్ముకాస్తున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని, సీపీఎంని బలపరచి చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, పొడియం రామారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

'జగనన్నకు చెబుదాం'లో వినతుల వెల్లువ

318 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి–కొయ్యూరు

కొయ్యూరు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండలంలోని 33 పంచాయతీలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్, జెసి, ఐటిడిఎ పిఓలకు వినతిపత్రాలు సమర్పించారు. రికార్డు స్థాయిలో 318 విన్నపాలు అందాయి. వీటిల్లో అధిక శాతం ఎన్‌హెచ్ 516ఇ రహదారి నిర్మాణానికి సంబంధించినవి, డిఆర్‌డిఎ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, రెవెన్యూ శాఖలకు చెందిన దరఖాస్తులు ఉన్నాయి. మఠం భీమవరం పంచాయతీ పరిధి మారుమూల గ్రామాలైన మండపల్లి పరిసర గ్రామాల నుంచి కూడా ఫిర్యాదులు అందడం విశేషం.

ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు మరింత చేరువగా మెరుగైన సేవలు అందించటానికి, వారి సమస్యలు అత్యంత దగ్గరగా పరిశీలించి సత్వర పరిష్కార చర్యలు తీసుకోవడానికి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సమస్యను నాణ్యవంతంగా పరిశ్కరించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ఫిర్యాదులు వెంట వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదుదారులను పదేపదే తిప్పించుకోవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఎంపిడిఓ లాలం సీతయ్య, తహసీల్దార్ సిహెచ్ తిరుమలరావు, ఎంపిపి బడుగు రమేష్‌బాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బూదరాళ్ల గ్రామ సమస్యలపై వినతి

మండలంలోని మారుమూల బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని సమస్యలపై దృష్టి పెట్టాలని గరిమండ గిరిజనులు కలెక్టర్‌కు ప్రత్యేక స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. గరిమండలో హెల్త్ సెంటర్ నిర్మించాలని, చింతపల్లి నుండి వచ్చే విద్యుత్ సరఫరా కట్ చేసి కాకరపాడు నుండి ఇవ్వాలని, అన్నవరం గ్రామానికి చెక్ డ్యాం నిర్మించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కొర్ర రమణబాబు, వంతల మాధవ్, బోనంగి సతీష్ తదితరులున్నారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో ఫిర్యాదుదారులకు భోజన వసతి కల్పించారు.

మండల సమస్యలపై ఎంపిపి వినతి

మండలంలోని సమస్యలపై ఎంపిపి బడుగు రమేష్ శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల, ఐటిఐ ఏర్పాటు చేయాలని, కాకరపాడు నుండి సింగవరం మధ్యలో రెండు వంతెనలు నిర్మాణం, పైడి పనుకులు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. వీటిపై జిల్లా కలక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రమేష్ తెలిపారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశా కార్యకర్తలుగా మార్చాలని సిఐటియు వినతి

జిల్లా వ్యాప్తంగా 750 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (సిహెచ్‌డబ్ల్యు)లను ఆశా కార్యకర్తలుగా మార్పు చేయాలని ప్రత్యేక స్పందన కార్యక్రమంలో సిఐటియు మండల గౌరవాధ్యక్షులు ఎస్.సూరిబాబు ఆధ్వర్యాన కలెక్టర్, డిఎం అండ్ హెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆశా కార్యకర్తలకు ఇచ్చే రాయితీలు వర్తింపజేయాలని కోరారు.



వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులు, పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ఉపాధి హామీ పనులు వంద రోజులు కల్పించాలి

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి–రంపచోడవరం

ఏజెన్సీలోని ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ ఉన్న కుటుంబాలకు వంద రోజులు ఎన్‌ఆర్‌ఇజిఎస్ పనులు కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఏడు మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ డైరెక్టర్లు, ఎపీఓలతో ఉపాధి హామీ పథకం పనులపై ప్రాజెక్ట్ అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీలలో ఎస్సీ ఎస్టీలకు ఎన్ని రోజులు ఉపాధి పనులు కల్పించిందీ ఆరా తీశారు. ప్రభుత్వ భూముల్లో పనులు ఎక్కడ నిర్వహించిందీ అడిగి తెలుసుకున్నారు. మంజూరైన ఉపాధి పనులన్నింటినీ ప్లాన్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని నిరుపేద గిరిజనులకు మంజూరైన ఇళ్లకు ఉపాధి పనులు ఏవిధంగా కల్పించుచున్నదీ తెలుసుకున్నారు. జాబ్ కార్డులు ఉన్న వాటిని ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. మండలాల్లోని వివిధ రకాల పనులకు వచ్చిన ప్రతిపాదనలన్నీ మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భూములలో వివిధ రకాలైన మొక్కలు వేయడానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉపాధి పథకం ఏపీడీలు భాగ్యరావు, యల్.రాంబాబు, సాయిబాబా, ప్రకాష్‌రెడ్డి బాబు, ఎ.రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిలపై అవగాహన

ప్రజాశక్తి–రాజవొమ్మంగి

పొగరాని పొయ్యిలపై అడ్డతీగల, వై.రామవరం మండలాల్లో గిరిజనులకు గురువారం, శుక్రవారాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. శుక్రవారం వై.రామవరం మండలం తోటకూర పాలెం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ అల్లూరి సీతారామరాజు జిల్లా డైరెక్టర్ డిపి రమేష్ మాట్లాడుతూ ట్రమోంటనా కంపెనీ వారు స్థానిక భాగస్వామ్యాలతో వినూత్నంగా తీసుకొచ్చిన పొగరాని పొయ్యిల వినియోగం ద్వారా ఎంతో ప్రయోజనం ఉందని చెప్పారు. ఈ నెల 8 నుండి 28వ తేదీ వరకు రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాలలో ట్రమోంటనా పొగరాని పొయ్యిల పంపిణీ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మట్టి పొయ్యిల వలన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ పొయ్యిలు కావాల్సిన గిరిజనులు తమ సమీపంలో ఉన్న కో–ఆర్డినేటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు పంచాయతీల సర్పంచులు బి.బుజ్జమ్మ, బి.సత్యనారాయణ, ఎం.గణలక్ష్మి, బి సింహాచలం, ఎం నూకరాజు, వార్డు సభ్యులు టి అనంతలక్ష్మి, క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది ఎస్.అచ్చారావు, టి శ్రీను, డి అన్నపూర్ణ, నవీన్, బాబురావు, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళన



ఆందోళన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, నకిలీ గిరిజనుడైన కార్తీక రాజకుమార్ పై కఠిన చర్యలు తీసుకుని నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ జారీ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు తహశీల్దార్ కార్యాలయంలో వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు.అనంతరం మండల తహశీల్దార్ వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేస్తూ వివరిస్తుండగా వినకుండా వెళ్ళిపోయారు. దీంతో మండల తహశీల్దార్ సమాధానం చెప్పాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జి.బుజ్జిబాబు. మాట్లాడుతూ,ఎస్టీ కార్తిక్ సూకదార ఇంటి పేరు ఏజెన్సీ 11 మండలాల్లో ఎక్కడ ఎవరు లేరని ఎస్టీ సూకదార కులంలో కార్తీక అనే ఇంటి పేరుతో ఉన్న వాళ్లకు ఎటువంటి బంధుత్వాలు లేవన్నారు. కార్తీక అనే ఇంటి పేరుతో ఉన్న వాళ్లు ఒరిస్సాలో ఓసి, ఎస్సీ కులానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. ఎలా రెవెన్యూ అధికారులు కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, పి నానిబాబు, టి.జోషి, కిల్లో జగన్నాథం, కిల్లో బుజ్జి బాబు, కోడ్స్, గురుమూర్తి, రామారావు, చిన్న బాబు గ్రామస్తులు కె.చిట్టిబాబు, అమర్ సాయి, బొంజో, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో పని చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ గిరి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సామాజిక బాధ్యతతో అందరం పని చేయాల్సి ఉందని జిల్లా అడిషనల్ పిడి గిరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులతో పాటు, గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఎన్ఎంఐ, ఉద్యానవన శాఖ వంద్ద పెంపకం, పింఛన్ దారులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 30 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ జరిగిందన్నారు. ఉపాధి హామీ ద్వారా వేతనదారులకు కందకాలు కందకాలు, మట్టి రోడ్డు, రాతి కట్టలు, వర్మి కంపోస్టు షెడ్డు పనులు కల్పించడం జరిగిందని చెప్పారు. ప్రజా వేదికలో శాఖల వారీగా జరిగిన పనులు, అడిషనల్ పీవీవో వైవి రావు, ఎంపీడీవో ఉషారాణి, ఎంపీపీ ఈశ్వరి, జడ్పిటిసి సభ్యురాలు జానకమ్మ, ఉప ఎంపీపీలు ఆనందరావు, లలిత, ఏపీవోలు దొరబాబు, సంగం నాయుడు, ఎన్ఆర్పీ, డీఆర్పీలు, ఉపాధిహామీ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీ, వేతనదారులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



మండల సభలో ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు : అన్ని ప్రభుత్వ శాఖల మండల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారితనంగా విధులు నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. శాఖల వారీగా మండల స్థాయి అధికారులు జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, స్థానిక సిహెచ్సీ వైద్యాధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించకుండా నిర్లక్ష్యం వహించడం వంటి సమస్యలపై సభ్యులు తెలియజేశారు. పలువురు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడ లేదన్నారు. రానున్న రోజుల్లో తీరు మారకపోతే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీటీసి, సర్పంచ్ లు ఆగ్రహించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ శాఖల ద్వారా జరుగుతున్న పనులపై ప్రజాప్రతినిధులకు కచ్చితంగా సమాచారం అధికారులు ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ శాఖ ద్వారా జరుగుతున్న పనులపై పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. మండల కేంద్రంలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులు నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, 1/70 చట్టం, పీసా చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉందని ఆమె సూచించారు. మండలాధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే సహించేది లేదని అధికారులపై ఆమె హెచ్చరించారు. సర్వ సభ్య సమావేశాలకు హాజరు కాని అధికారులపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ2 భాగ్యవతి, ఎంపిడివో కె.కిరణ్ కుమార్,

కరువు మండలంగా ప్రకటించాలి: సిపిఎం

ముంచింగిపుట్టు: మండల వ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురవక పోవడంతో వరి, రాగులు, సామలు,చిరుధాన్యాలు, వాణిజ్య పంటలతో పాటు రాజ్ మా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అందుకు కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలని శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశ మందిరం ఎదుట సిపిఎం నాయకులు, గిరిజన రైతులు ఆందోళన చేపట్టారు. తక్షణమే అధికారులు స్పందించి కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన గిరిజన రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పి. భీమరాజు కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసబాబుకు నష్టపోయిన రైతుల దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎం.ఎం శ్రీను, నారాయణ,గాసిరం దొర,జీనాబంధుతో పాటు గిరిజన రైతులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థులకు ఫెడరల్ బ్యాంక్ బంపర్ ఆఫర్

రూ.14.38 లక్షల వార్షిక వేతనంతో 10 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస ఇంటర్వ్యూలలో బిజినెస్ స్కూల్ విద్యార్థులకు ప్రముఖ ఫెడరల్ బ్యాంక్ బంపర్ ఆఫర్ అందించింది. పది మంది ఎంబిఎ ఫైనలియర్ విద్యార్థులకు రూ.14.38 లక్షల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసిందని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజులు తెలిపారు. అలాగే డెలాయిట్, రిలయన్స్ బిపి మొబిలిటి లిమిటెడ్, ఏషియన్ పెయింట్స్, టాటా ఎఐజి, బెర్కాడియా బిఎస్ఎమ్ సొల్యూషన్స్, డేటా లింక్ సాఫ్ట్‌వేర్, ఆక్సేన్ పార్టనర్స్ సంస్థలు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో మరో 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. రానున్న రోజులలో ప్రముఖ కంపెనీలు నెస్లే, కాల్గేట్ పామోలివ్, కెపిఎమ్‌జి, ప్రైస్ వాటర్‌కూపర్, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రాంగణ నియామకాలను జరపనున్నాయన్నారు. విద్యార్థులకు ప్రణాళికయుత శిక్షణ, కార్పొరేట్ రంగం నిపుణులతో చర్చా కార్యక్రమాలు నిర్వహణ వంటి వర్సిటీ చేపట్టిన చర్యలు, ప్రాంగణ నియామకాలలో విద్యార్థులు విజయానికి దోహదపడ్డాయన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు అభినందించారు.

బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా చేరిన విద్యార్థులు కళాశాలలో ఉన్న వసతులను ఉపయోగించుకొని, విజ్ఞానాన్ని సంపాదించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల లోగోను, కళాశాల మేగ్‌జైన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

13 కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్టు



నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో మండల కేంద్రంలోని ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో తనిఖీ చేపట్టగా తరలిస్తున్న 13 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు అరకులోయ ఎస్సై సతీష్ తెలిపారు.ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గంజాయి రవాణా చేస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీసు సిబ్బందితో తనిఖీలు చేసి ఆరు వ్యక్తులను అరెస్టు చేసి 13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వీరిలో బెంగళూరుకి చెందిన ఇద్దరు నిందితులు, డుంబ్రిగూడ మండలం కించుమండ పంచాయతీకి చెందిన నలుగురు వ్యక్తులుగా గుర్తించామని తెలిపారు. ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాచకుడు మృతి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని వారపు సంత షెడ్డులో శుక్రవారం యాచకుడు మృతి చెందాడు. ఈ సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి గోపి, సర్పంచ్ సుభాష్ చంద్రలకు స్థానికులు తెలిపారు. విఆర్ఓ రమేష్ పంచాయతీ కార్యదర్శి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యారు చేసారు, స్థానిక ఏఎస్సై లక్ష్మణరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వంతెన పనులు పూర్తి

ప్రజాశక్తి -అనంతగిరి:ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఉన్న గ్రామాలకు రోడ్డు సౌకర్యాలతో పాటు వంతెన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లది రూపాయల నిధులతో మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి కాటూరు, సార్వనిపాలెం సరిహద్దు లో ట్రైబల్ వెల్ఫేర్ పథకం కింద సుమారు రెండు కోట్ల నిధులతో చేపట్టిన వంతెన పనులు పూర్తయ్యాయి. ఈ వంతెనకు అనుకుని కాశీపట్నం, కొత్తూరు పంచాయతీ పరిధి సుమారు 10 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుంది.

బిఎల్ఒలతో సమావేశం

ప్రజాశక్తి-పెదబయలు:స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవెల్ అధికారుల సమావేశం నిర్వహించారు. 18 ఏళ్ళు నిండిన యువత ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవడంపై తహసీల్దార్ సిహెచ్ కృష్ణారావు అవగాహనా కల్పించారు. పేర్ల మార్పునకు అధికారులను సంప్రదించాలన్నారు.

కెజిబివిని సందర్శించిన అమెజాన్ బృందం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని నేలతేరు కస్తూర్బా గాంధీ పాఠశాలను అమెజాన్ కేంద్ర కమిటీ బృందం శుక్రవారం సందర్శించింది. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి (ఇఎండిపి) కార్యక్రమం 9వతరగతి విద్యార్థులకు ఎంతవరకు ఉపయోగకరంగా ఉందో పరిశీలించారు. దీని ద్వారా విద్యార్థుల ఆలోచన విధానంలో వచ్చిన మార్పులు, పెంపొందిన సామర్థ్యాలు అంచన వేయడానికి జిల్లాలో పర్యటిస్తున్న అమెజాన్ కేంద్రబృందం విద్యార్థులతో మమేకమై, కార్యక్రమానికి సంబంధించి పలుప్రశ్నలు వేసి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మక కృత్యాలు, ప్రాజెక్ట్‌లు తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. జొన్నలగడ్డ జయవర్ధన్. చాగంటి బ్రహ్మం, ఆపరేషన్స్ ఎపి జోనల్ మేనేజర్ అగ్నిహోత్ర శర్మ ఓరుగంటి, కాకర నరేష్, పాల్గొన్నారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

సిహెచ్‌సిలో చర్మ వ్యాధులు, జనరల్ సర్జన్ వైద్య సేవలు

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చర్మ వ్యాదులకు సంబంధించిన వైద్య సేవలు, జనరల్ సర్జన్ సేవలు ప్రతి రోజూ అందుబాటులో ఉన్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టివి.శేషారెడ్డి శుక్రవారం తెలిపారు. జనరల్ సర్జన్‌గా డాక్టర్ కె.మహేష్‌బాబును వైద్య ఆరోగ్య శాఖ నియమించినట్లు చెప్పారు. ముగ్గురు జనరల్ వైద్యాధికారుల పోస్టులను కూడా భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. కూనవరం ఆసుపత్రిలో ఇకపై రోగులకు అన్ని సమయాలలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు, ఎక్స్ రే, స్కానింగ్ సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్లేట్‌లేట్ సెల్ కౌంటర్ కూడా ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజులకు ఒక సారి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు కూడా చేస్తున్నట్లు తెలిపారు. కూనవరం ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు ప్రజలు పొందవచ్చన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన స్థానిక సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 12న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే కంటి పరీక్షలు, న్యూరో వైద్యులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ గారిచే ఫిట్స్, మూర్ఛ వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షలు చేసిన వారికి మందులు, కళ్ళ జోళ్లు ఇవ్వడంతో పాటు కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి పరమ హంస యోగానంద నేత్రలయంలో శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చు వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఫిట్స్ రోగులకు నాలుగు నెలలకు సరిపడా మందులు ఇస్తామని, వారు ఇప్పటి వరకు వాడిన మందులు మందుల చీటిలు తప్పనిసరిగా తీసుకునిరావాలని కోరారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని స్థానిక రేంజ్ అధికారి ఎం.అబ్బాయిదొర అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవ నేపథ్యంలో శుక్రవారం రేంజర్ అబ్బాయి దొర ఆధ్వర్యంలో సిబ్బంది తొలిత గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక రేంజ్ కార్యాలయం వద్ద అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్బాయిదొర మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు పి.రాము, డిఎస్ఎన్.మూర్తి, అర్జునుడు, సుబ్బయ్యమ్మ, బాలాజీ, ఎఫ్బిఓలు ప్రసాద్, ఆనంద్, కె.రామకృష్ణ, రైటర్ మధు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నేత పంచకర్లకు సన్మానం

ప్రజాశక్తి-కొయ్యూరు : జనసేన పార్టీ విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు వచ్చిన సందర్భంగా ఆయన్ను కొయ్యూరు మండలానికి చెందిన జనసేన నాయకులు సాలువ కప్పి సన్మానం చేశారు. కొయ్యూరు మండల సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు గూడెం లక్ష్మణ్, సాగిన బుజ్జిబాబు, కూర రాజేష్, పొట్టిక రాంప్రసాద్, కూడా దేవుడు, నాగేంద్ర, కాకర కుమార్, పీట సుధీర్, నివాస్, సిహెచ్.సిద్దు, పొట్టిక స్వామి నాయుడు, కొనకం జోగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం



సమావేశానికి సిద్ధమవుతున్న ప్రాంగణం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు డి పైడిమల్లి, జి రమణ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో గత కార్యక్రమాల సమీక్ష, ఉపాధ్యాయ సమస్యలపై భవిష్యత్తు కర్తవ్యాలు, నూతన కమిటీ ఎన్నిక తదితర అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథిగా ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. సమావేశానికి వందలాది మంది ఉపాధ్యాయుల హాజరవుతున్న నేపథ్యంలో ఇప్పటికే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను, సమావేశ వేదికను, ప్రాంగణాన్ని యుటిఎఫ్ నాయకులు ఎర్రజెండాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ రవీంద్రనాథ్, మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి ఆధ్వర్యంలో మండలంలోని బంధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. రన్నింగ్, కుర్చీ ఆట, లాంగ్ జంప్, బస్తాల జంప్ తదితర ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన సుమారు 50 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో ఇప్పటివరకు అనేక కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్.వెంకయ్య అన్నారు. రాజవొమ్మంగి ఎస్ఐగా శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకయ్య స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

12న దీపావళి పండుగ నేపథ్యంలో మందు గుండి సామాగ్రి విక్రయాలు దారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, దుకాణాల వద్ద తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ వెంకయ్యను పోలీస్ సిబ్బంది మర్యాదగా పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన భారత్, బంగ్లా ద్వైపాక్షిక విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత్ - బంగ్లాదేశ్ నావికాదళాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాలు 4వ ఎడిషన్ బొంగో సాగర్ - 23, రెండు నావికాదళాల సమన్వయ గస్తీ కార్పాట్ 5వ ఎడిషన్ విన్యాసాలు ఉత్తర బంగాళాఖాతంలో గురువారంతో ముగిశాయి. ఇవి ఈ నెల 7న ప్రారంభమైనట్లు నేవీ తెలిపింది. విన్యాసాల్లో భాగంగా అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ (ఐఎంబిఎల్) వెంబడి రెండు నౌకాదళాలకు చెందిన నౌకలు, విమానాలు సంయుక్తంగా గస్తీ నిర్వహించాయి. భారత నౌకాదళానికి చెందిన కుథర్, కిల్తాన్, మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్ క్రాఫ్ట్ (ఎంపిఎ) డోర్నియర్‌తో పాటు బంగ్లాదేశ్ నౌకాదళ నౌకలు అబూబకర్, అబూ ఉబైదా, ఎంపిఎ ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి.

జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరుస్తాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు నిబంధనలు సరళతరంగా ఉంటాయని, వారి సొంత ఇంటి కలను ప్రభుత్వం నెరవేర్చనుందని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరపాలని నిర్ణయిస్తూ క్యాబినెట్ ఆమోదించిన నేపథ్యంలో విశాఖ అక్రిడేటెడ్ జర్నలిస్ట్‌ల హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన థాంక్స్ గివింగ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98.9 శాతం నెరవేర్చిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్రతి జర్నలిస్టుకూ సొంత ఇల్లు ఉండాల్సిన అవసరముందన్నారు.

మద్యం ద్వారా దోపిడీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మద్యం ద్వారా లక్ష కోట్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దోచుకున్నారని టిడిపి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాసిరకం కల్తీ మద్యాన్ని ప్రభుత్వం అమ్మకాలు చేస్తోందన్నారు.

వైసిపిది తుస్సు యాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి చేస్తోంది బస్సు యాత్ర కాదని, తుస్సు యాత్ర అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ అన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌కు జగన్ ఎందుకు అని వైసిపి వారే అంటున్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసినందుకా ? మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారంటూ దుయ్యబట్టారు.

గర్భిణులకు ఉచిత భోజన సౌకర్యం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చే గర్భిణులకు ఉచిత భోజన సౌకర్యం బాలాజీ రెస్టారెంట్ యజమాని నక్క జ్ఞానేశ్వరరావు కల్పిస్తున్నారు. గర్భిణులకు సహాయకులుగా వచ్చే కుటుంబ సభ్యులకు ఒకరికి రూ.50కే భోజనం పెట్టడానికి నక్క జ్ఞానేశ్వరరావు ముందుకొచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద గర్భిణులకు ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేయబడును భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని గర్భిణులు, వారి బంధువులు సద్వినియోగం చేసుకోవాలని జ్ఞానేశ్వరరావు కోరారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కుటుంబ సభ్యులు మందలించారని మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని లబ్బర్తి గ్రామానికి చెందిన పైలా నారాయణమూర్తి (45) రోజు మద్యం సేవిస్తూ భార్య పిల్లలతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 28న కుటుంబ సభ్యులు గట్టిగా మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన నారాయణమూర్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం నారాయణమూర్తి మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'భవిష్యత్ గ్యారెంటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలం ఎం.మాకవరం పంచాయతీ పరిధి నడింపాలెం గ్రామంలో టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామ్మూర్తి, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు పోటుకూరి సన్యాసిరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా 89, 92 బూత్‌ల పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సీహెచ్.ప్రసాద్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు సాధారణ మార్గమైన నిడదవోలు - ఏలూరు - విజయవాడ బదులు నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తాయని అధికారులు తెలిపారు. 13351 ధన్‌బాద్ - అలప్పుజా బొకారో ఎక్స్‌ప్రెస్ నవంబర్ 13 నుంచి 17 వరకు, 22837 హటియా - ఎర్నాకులం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 13న, 12835 హతియా - ఎస్ఎంవి బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 14న, 12376 జసిదిహ్ - తాంబరం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 15న, 18111 టాటా - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 16న, 12889 టాటా - ఎస్ఎంవి బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నవంబర్ 17న మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

భూ బాధితులకు ఇళ్లు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన బాధిత రైతులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని కోరుతూ బాధిత కుటుంబాలతో కలిసి సీతమ్మధారలోగల భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటి వద్ద సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, డి.అప్పలరాజు వినతిపత్రం అందజేశారు.